
ADMISSIONS ARE IN PROGRESS 2024-25
Secretary & Correspondent
Bikki Venkateshwarlu
M.Sc (Physicis), M.Ed.
Join your kids with us & Empower their Academic Excellence with Ethical Foundations
INDIRA VIDYALAYA
Nursery to VII class, English Medium
Near Bodrai, Mahabubabad.
Cell: 9701912300, 9705412300

దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 02 సంచిక : 80 | శుక్రవారం 21-03-2025 | ఎడిటర్ : వేముల అయోధ్య రాములు | పేజీలు : 4 | వెల : 5 రూ/..

## పంచుకు తింటే..
# పట్టు వచ్చినట్లా?



**తొలి సమయం, హైదరాబాద్, మార్చి 20:**
"రేవంత్ రెడ్డికి పాలనలో పట్టు రాలేదని అంటున్నారు. దళితుడు రాజయ్యను, బలహీన వర్గాలకు చెందిన ఈటల రాజేందర్‌ను మంత్రివర్గం నుంచి తప్పిస్తే పట్టు వచ్చినట్లా!? వాళ్లను తీసేయడానికి సహేతుకమైన కారణం చెప్పి ఉంటే నీకు పట్టు ఉన్నట్లు! తప్పు చేసిన నీ సొంత మనుషులను అయినా లోపల వేయిస్తే పట్టు వచ్చినట్లు!? అంతే తప్పు.. పంచుకు తింటే పట్టు వచ్చినట్లా!?" అంటూ మాజీ సీఎం కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పదేళ్లు సచివాలయానికే రాని వ్యక్తికి పాలనపై పట్టు వచ్చిందని అంటున్నారని, ప్రతి రోజూ 18 గంటలు పని చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉన్న తనకు పట్టు రాలేదని అంటున్నారని విమర్శించారు. అప్పుడూ ఇప్పుడూ అధికారులు వాళ్లేనని, వ్యవస్థ కూడా అదేనని, మారింది కేవలం 11 మంది మంత్రులు మాత్రమేనని తెలిపారు. అప్పుడు కేసీఆర్, కేటీఆర్, హరీశ్ తదితరులు ఉంటే.. ఇప్పుడు రేవంత్, సీతక్క, భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు తదితరులు ఉన్నారని చెప్పారు. మరి మేం ఎక్కడ విఫలమయ్యామని నిలదీశారు. కొలువుల పండుగ పేరిట రవీంద్ర భారతిలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖలో 588 మందికి కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. అదేవిధంగా పురపాలక శాఖ, మిషన్ భగీరథ విభాగాల్లో పలు ఉద్యోగాలకు సంబంధించిన నియామక పత్రాలను అందజేశారు. 'బిల్డ్ నౌ' పోర్టల్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడారు. "నేను రాజకీయాల్లోకి వచ్చి 20 ఏళ్లు దాటింది. సీఎం అయ్యారు కాదా మారాలంటున్నారు. హుందాగా వ్యవహరించాలంటున్నారు. నేను హుందాగా వ్యవహరిస్తే.. అర్థం చేసుకునే వాళ్లు ఉండాలి కదా..?" అని వ్యాఖ్యానించారు. జానారెడ్డి పెద్ద మనిషిలా హుందాగా వ్యవహరించారని, ధృతరాష్ట్ర కౌగిలితో కేసీఆర్ ఆయన గౌరవాన్ని మంటగలిపారని ఆరోపించారు. మీ పాలనలో కోదండరామ్ తలుపులు పగులగొట్టించారని, మీలాగే మేం కూడా పోలీసులను ఆదేశిస్తే.. ఇళ్లలో నుంచి బయటకు రానీయకుండా తాళమేసి ఒంగోబెట్టి దంచరా? అని ప్రశ్నించారు. కేటీఆర్ తలుపులు పగులగొట్టి వీపులు వలగ దంచరా? అని మండిపడ్డారు. "పోలీసులకు మీరు చెప్పారు. నేను చెప్పలేదు. అలాంటి విధానానికి మేం వ్యతిరేకం. గడీల్లో దొరల్లాగా పెరగకపోవచ్చు. మాకు మానవత్వం ఉంది. మీకు అది లేదు. నేను విజ్ఞతను ప్రదర్శిస్తున్నా. అది మీరు చూపలేదు. మీకు మాకు అదే తేడా" అని స్పష్టం చేశారు. తనపై అన్ని వర్గాల ప్రజలు కోపంగా ఉన్నారని ప్రచారం చేస్తున్నారని, రుణ మాఫీ చేసినందుకు రైతులు, ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించినందుకు ఆడబిడ్డలు, 57 వేల ఉద్యోగాలు కల్పించినందుకు నిరుద్యోగులు కోపంగా ఉన్నారా అని సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు. ఎస్‌హెచ్‌జీ సంఘాలకు ఆర్టీసీ బస్సులు, సోలార్ విద్యుదుత్పత్తి కాంట్రాక్టు ఇస్తున్నందుకు కోపంగా ఉంటారా? అని ప్రశ్నించారు. అడ్డగోలుగా సంపాదించారని, ఆ డబ్బుతో ఇప్పుడు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. నల్ల ధనాన్ని వాట్సాప్ వర్సిటీలో పెట్టుబడిగా పెట్టి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అందాల పోటీలు హైదరాబాద్‌లో ఎందుకని ఒకాయన అంటున్నారని, ఆయన బాధ అర్థం కావడం లేదు కానీ.. హైదరాబాద్‌కు, పర్యాటక రంగానికి ఇది అందివచ్చిన అవకాశమని చెప్పారు. 140 దేశాలకు చెందిన ప్రతినిధులు, 3000 చానళ్లు, పత్రికల ప్రతినిధులు రానున్నారని, రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల్లో పర్యటిస్తారని, తద్వారా, ప్రపంచంలోనే హైదరాబాద్ ల్యాండ్ మార్క్ కానుందని స్పష్టం చేశారు. ఇంత మంచి సందర్భం వస్తే అభినందించాల్సిందిపోయి విమర్శలు చేయడం తగదని అన్నారు. "ఫార్ములా ఈ రేస్ ముసుగులో ప్రభుత్వ డబ్బులు కొల్లగొట్టావ్ సామీ.. ఉద్యమం ముసుగులో ఉన్నదంతా ఊడ్చుకుపోయే ఆలోచనలో మీరున్నారు. ప్రజాకోణంలో వారి సమస్యలు పరిష్కరించాలన్న ఆలోచనలో నేనున్నా. మీకు, నాకు తేడా ఇదే" అని వ్యాఖ్యానించారు.

## బండి సంజయ్‌కు హైకోర్టులో భారీ ఊరట

### జిహెచ్ఎంసి ఎన్నికల కేసు కొట్టివేత



**తొలి సమయం, హైదరాబాద్,మార్చి20:** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు హైకోర్టులో భారీ ఊరట లభించింది. గత జీహెచ్ఎంసీ ఎన్నికల ప్రచార సమయంలో మత విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రసంగించారనే ఆరోపణలపై సికింద్రాబాద్ మార్కెట్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఆయనపై ఛార్జ్‌షీట్ కూడా దాఖలైంది. అయితే, తగిన ఆధారాల్లేవన్న కారణంతో హైకోర్టు ఈ కేసును కొట్టివేసింది. జీహెచ్ఎంసీ ఎన్నికల సందర్భంగా బీజేపీ నాయకుడు బండి సంజయ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మత విద్వేషాలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారని కొందరు వ్యక్తులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుతో స్పందించిన సికింద్రాబాద్ మార్కెట్ పోలీసులు ఆయనపై కేసు నమోదు చేసి, విచారణ అనంతరం ఛార్జ్‌షీట్ కూడా దాఖలు చేశారు. బండి సంజయ్‌పై నమోదైన కేసు హైకోర్టులో విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా బండి సంజయ్ తరఫున న్యాయవాది కోర్టులో వాదనలు వినిపించారు. బండి సంజయ్ మత విద్వేషాలను రెచ్చగొట్టారని నిరూపించే ఆధారాలు లేవని న్యాయవాది వాదించారు. ఆధారాలు లేకుండా రాజకీయం చేయడానికి కేసు నమోదయ్యిందని కోర్టుకు వివరించారు. కేవలం రాజకీయ కారణాల రీత్యా ఈ కేసును పెట్టారని, న్యాయపరంగా దీని ఆధారభూతతను పరిశీలించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ వాదనలను పరిశీలించిన హైకోర్టు న్యాయమూర్తి, బండి సంజయ్‌పై నమోదు చేసిన కేసులో తగిన ఆధారాలు లేవని తేల్చారు. ఎలాంటి నేరపూరిత ప్రకటనలు లేకుండా కేసు నమోదు చేయడం సరికాదని కోర్టు వ్యాఖ్యానించింది. అన్ని వాదనలు పరిశీలించిన తర్వాత, బండి సంజయ్‌పై నమోదైన కేసును హైకోర్టు కొట్టివేసింది. తగిన ఆధారాల్లేకుండా నేరపూరిత ఉద్దేశంతో కేసు నమోదు చేయడం సరికాదని కోర్టు స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పుపై బండి సంజయ్ అనుచరులు హర్షం వ్యక్తం చేశారు. ఇది రాజకీయ కక్ష సాధింపుకు నిదర్శనమని, న్యాయం గెలిచిందని బీజేపీ నేతలు పేర్కొన్నారు.

## బెట్టింగ్ యాప్స్‌లో కీలక పరిణామం

### టాలీవుడ్ ప్రముఖులపై కేసు నమోదు
### రానా, విజయ్ దేవరకొండ, ప్రకాశ్ రాజ్‌లపై కేసు




**తొలి సమయం హైదరాబాద్,మార్చి20:**
బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆ యాప్‌లను ప్రమోట్ చేసిన వారిలో ఉన్న ప్రముఖ నటీనటులపై మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. నటీనటులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు సహా మొత్తం 25 మంది ఈ జాబితాలో ఉన్నారు. సినీ ప్రముఖుల జాబితాలో రానా దగ్గుబాటి, విజయ్ దేవరకొండ, ప్రకాశ్‌రాజ్, మంచు లక్ష్మి, ప్రణీత, నిధి అగర్వాల్ ఉన్నారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లలో అనన్య నాగళ్ల, సిరి హనుమంతు, శ్రీముఖి, వర్షిణి సౌందరరాజన్, వాసంతి కృష్ణన్, శోభా శెట్టి, అమృత చౌదరి, నయని పావని, నేహా పఠాన్, పండు, పద్మావతి, ఇమ్రాన్‌ఖాన్, విష్ణు ప్రియ, హర్ష సాయి, బయ్యా సన్నీ యాదవ్, యాంకర్ శ్యామల, టేస్టీ తేజ, రీతూ చౌదరి, బండారు సుప్రీత ఉన్నారు. మియాపూర్ వాసి ప్రమోద్ శర్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దాదాపు 25 మందిపై సైబారాబాద్‌కి చెందిన మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసి యువతను చెడగొడుతున్నారని మియాపూర్‌కి చెందిన ప్రమోద్ శర్మ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ప్రమోషన్లను అరికట్టేందు కు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కోరారు.

## సైన్యం మరింత శక్తిమంతం!

### 54 వేల కోట్లతో మిలటరీ హార్డ్‌వేర్ కొనుగోలుకు డీఏసీ ఓకే

**న్యూఢిల్లీ, మార్చి 20:** భారత సైన్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు, యుద్ధ సామర్థ్యాన్ని ఆధునీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా రూ.54 వేల కోట్లతో భారీఎత్తున మిలటరీ హార్డ్‌వేర్ పరికరాలను కొనుగోలు చేసేందుకు గురువారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో జరిగిన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ (డీఏసీ) సమావేశం ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా 'ఎయిర్‌బోర్న్ ఎర్లీ వార్నింగ్ అండ్ కంట్రోల్ ఎయిర్‌క్రాఫ్ట్' వ్యవస్థలు, టార్పెడోలు, టీ-90 ట్యాంకుల కోసం ఇంజన్లు వంటివి కొనుగోలు చేయనున్నారు. మరోవైపు భారీఎత్తున దేశీయంగా తయారు చేసిన ఆర్టిలరీ శతఘ్నుల కొనుగోలుకు కేంద్రం పచ్చజెండా ఊపింది. ఆర్మీ కోసం అడ్వాన్స్‌డ్ టోవ్డ్ ఆర్టిలరీ గన్



సిస్టమ్స్ (ఏటీఏజీఎస్) కొనుగోలుకు సంబంధించి రూ.7 వేల కోట్ల ఒప్పందానికి ప్రధాని మోదీ నేతృత్వంలోని క్యాబినెట్ కమిటీ (భద్రత) ఆమోదం తెలిపింది. ఈ ఒప్పందంలో భాగంగా 307 హొవిట్జర్లను కొనుగోలు చేయనున్నారు. అదేవిధంగా సైన్యంలోని 15 ఆర్టిలరీ రెజిమెంట్లకు ఆయుధాలు సమకూర్చేందుకు 327 శతఘ్నులను తీసుకెళ్లే వాహనాలు (గన్ టోయింగ్ వెహికల్స్) కొనుగోలు చేస్తారు. 155ఎంఎం/52 క్యాలిబర్ 'ఏటీఏజీఎస్'ను డీఆర్‌డీవో అభివృద్ధి చేయగా.. భారత్ ఫోర్జ్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ సంస్థలు ఉత్పత్తి చేయనున్నాయి. బిడ్డింగ్‌లో భారత్ ఫోర్జ్ ఎల్-1గా నిలిచిన నేపథ్యంలో.. ఆ సంస్థ 60 శాతం శతఘ్నులను, టాటా సంస్థ మిగతా 40 శాతం తయారు చేయనుంది.

## ఛత్తీస్‌ఘడ్ ఎన్‌కౌంటర్లో 22మంది మావోల హతం

### నక్సల్స్ ముక్త భారత్‌లో పెద్ద విజయమన్న అమిత్ షా

**న్యూఢిల్లీ,మార్చి20:**



ఛత్తీస్‌గఢ్‌లోజరిగిన కాల్పుల్లో (22 మావోయిస్టులు మృతి చెందారు. దీంతో మావోలకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఇటీవలి ఎన్‌కౌంటర్లలో పదుల సంఖ్యలో మావోలు హతమవుతున్నారు. ఈ ఘటనపై కేంద్రమంత్రి అమిత్ షా స్పందించారు. భారత్‌ను నక్సల్ రహిత దేశంగా మార్చేందుకు చేపట్టిన ఆపరేషన్‌లో ఇది మరో పెద్ద విజయమని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నక్సలైట్ల పట్ల కఠిన వైఖరి అవలంబిస్తోందని పేర్కొన్నారు. అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పిస్తున్నా కొందరు నక్సలైట్లు- లొంగిపోవడం లేదు. అలాంటి వారి పట్ల మోదీ సర్కార్ కఠిన వైఖరి అవలంబిస్తోంది. మన సైనికులు 'నక్సల్ ముక్త్ భారత్ అభియాన్' దిశలో మరో పెద్ద విజయాన్ని సాధించారు. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, కాంకెర్‌లలో మన భద్రతా దళాలు నిర్వహించిన రెండు వేర్వేరు ఆపరేషన్లలో 22 మంది నక్సలైట్లు- హతమయ్యారు.

## కెటీఆర్ పాదయాత్ర

### వచ్చే యేడాది ప్రారంభిస్తానని వెల్లడి

**తొలి సమయం హైదరాబాద్,మార్చి20:**
భారాసను అధికారంలోకి తీసుకురావడమే ధ్యేయంగా వచ్చే ఏడాది నుంచి పాదయాత్ర చేయనున్నట్లు- ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. సూర్యాపేటలో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పాదయాత్రపై కసరత్తు జరుగుతోందని, తాను సిద్ధమవుతున్నానని తెలిపారు. అధినేత అనుమతితో వచ్చే ఏడాది నుంచి చేయాలని భావిస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం జిల్లాల పర్యటనలు ప్రారంభించానన్న కేటీ-ఆర్.. డిసెంబరు వరకు పార్టీ బలోపేతం చేసే కార్యక్రమాల్లో నిమగ్నం అవుతామని చెప్పారు. భారాస రజతోత్సవాలతో పాటు- శిక్షణా తరగతులు, సభ్యత్వ నమోదు, కమిటీ-ల ఏర్పాటు- సంస్థాగత కార్యక్రమాలపై దృష్టి పెట్టినట్లు- వివరించారు. పార్టీ చేపడుతున్న కార్యక్రమాలకు అద్భుత స్పందన వస్తోందని, సూర్యాపేట కార్యక్రమానికి బహిరంగసభ తరహాలో జనం తరలివచ్చారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో భారాస అధికారంలోకి రావడం ఖాయమని కేటీఆర్ తెలిపారు.పాదయాత్ర చేస్తే ముఖ్యమంత్రి అయిపోతారన్న నమ్మకం రాజకీయ నాయకుల్లో బలపడిపోయింది. అందుకే పాదయాత్ర చేయడానికి సిద్ధంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా పాదయాత్రకు సిద్ధమయ్యారు. వచ్చే ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేపట్టనున్నట్లు ప్రకటించారు. బీఆర్ఎస్‌ను అధికారంలోకి తేవడమే లక్ష్యంగా పాదయాత్ర సాగుతుందని ఆయన అన్నారు. కేటీఆర్ పాదయాత్ర ప్రకటన రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కేటీఆర్ పాదయాత్ర చేసి పార్టీని గెలిపించి, ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారనే పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఉమ్మడి ఏపిలో తొలుత వైఎస్ రాజశేఖర్ రెడ్డి 2003, ఏప్రిల్ 9వ తేదీన పాదయాత్ర చేపట్టారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నుంచి ఈ పాదయాత్ర ప్రారంభం అయింది. మొత్తం 60 రోజుల పాటు- 1,500 కిలో మీటర్లు పాదయాత్ర చేశారు. రంగారెడ్డి, మెదక్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, పశ్చిమ, తూర్పుగోదావరి, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల మీదుగా 11 జిల్లాల్లో పర్యటించారు. శ్రీకాకుళంలోని ఇచ్ఛాపురం వద్ద పాదయాత్ర ముగిసింది. మరుసటి సంవత్సరం 2004లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచింది.



## పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

**గాజా,మార్చి20:**
ఇజ్రాయెల్, హమాస్ ల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో పశ్చిమాసియా మళ్లీ రణరంగంగా మారింది. ఇటీవల ఇజ్రాయెల్ జరిపిన భీకర దాడుల్లో 400 మందికి పైగా ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. తాజాగా టెల్‌అవీవ్ దళాలు మరోసారి వైమానిక దాడులతో విరుచుకుపడ్డాయి. ఈ దాడుల్లో అనేకమంది మృతి చెందినట్లు తెలుస్తోంది. గురువారం ఉదయం గాజాపై ఐడీఎఫ్ వైమానిక దాడులు చేసింది. ఈ దాడుల్లో దాదాపు 70 మంది మృతి చెందినట్లు- స్థానిక అధికారులు తెలిపారు. ఇందులో ఓ మహిళతో సహా అనేక మంది చిన్నారులు ఉన్నట్లు- వెల్లడించారు. ఇక, ఇజ్రాయెల్ రక్షణమంత్రి కాట్జ్ గాజాకు తీవ్ర హెచ్చరికలు చేశారు. బందీలందరినీ తిరిగివ్వడానికి ఇదే చివరి అవకాశమని లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటు-ందని పేర్కొన్నారు. మరోవైపు.. నెట్జారిమ్ నడవాలో కొంత భూభాగాన్ని టెల్‌అవీవ్ స్వాధీనం చేసుకుంది. ఇక్కడినుంచి పాలస్తీనావాసుల కదలికలను నియంత్రించే వెసులుబాటు- దానికి దక్కింది. మంగళవారం గాజాపై ఇజ్రాయెల్ భీకర దాడులు చేసింది. ఈ దాడుల్లో 400 మందికి పైగా మృతిచెందగా.. అనేకమంది గాయపడ్డారు. మృతుల్లో చిన్నారులు, మహిళలే ఎక్కువమంది ఉన్నారు. ఇజ్రాయెల్- హమాస్‌ల మధ్య తొలిదశ కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిన సంగతి తెలిసిందే.

## లెక్క తప్పిన బడ్జెట్ అంచనాలు

### గత బడ్జెట్ నిధుల ఖర్చుపై పొంతన ఏదీ
### నియోజకవర్గానికి 3550 ఇల్లు ఎక్కడ
### మాజీమంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ ప్రశ్న

**హైదరాబాద్,మార్చి20:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ వాస్తవానికి దూరంగా ఉన్నదని, అది తూతూ బడ్జెట్ అని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. గురువారం సికింద్రాబాద్‌లోని తహసిల్దార్ కార్యాలయంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. గత సంవత్సరం బడ్జెట్‌లో ప్రకటించిన నిధులలో ఎంత మేర ఖర్చు పెట్టారో కూడా ప్రజలకు స్పష్టం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం ఉందన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలనే కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్ లో పొందుపర్చడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. ఒక్కో నియోజకవర్గానికి 3500 ఇండ్లను మంజూరు చేస్తున్నట్లు గత బడ్జెట్ లో కూడా ప్రకటించారని, ఎక్కడ ఇచ్చారో చూపిస్తారా అని ప్రశ్నించారు. అధికారం కోసం అనేక రకాల హామీలు ఇచ్చి ప్రజలకు లేనిపోని ఆశలు కల్పించారని, అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతున్నా హామీలు అమలుకు నోచుకోవడం లేదని విమర్శించారు. వరద ముంపు సమస్య పరిష్కారం కోసం నాలాలలో పూడిక తొలగింపు పనులకు తమ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇప్పటి వరకు పూడిక తొలగింపు పనులు ప్రారంభించలేదని, ఇంకెప్పుడు చేపడతారని ప్రశ్నించారు. హైదరాబాద్ నగరంలో విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, త్రాగునీటికి కటకట ఏర్పడిందని, ట్యాంకర్ లే దిక్కు అన్నట్లు-గా పరిస్థితి మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రభుత్వం ఊక దంపుడు ప్రసంగాలను మానుకోవాలని హితవు పలికారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారని అన్నారు. ఇప్పటి-కై-నా ప్రభుత్వం తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని చెప్పారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారని, ప్రజలు ఎదురు చూస్తున్నారని తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు.

## పదవ తరగతి పరీక్షలు ప్రతి విద్యార్థి

# జీవితానికి ఒక మైలురాయి

### పదవ తరగతి విద్యార్థులందరికీ ఆల్ ది బెస్ట్. జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్




**తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ కొత్తగూడెం మార్చి 20**
నేటినుండి ప్రారంభమయ్యే 10వ తరగతి పరీక్షలు రాయబోతున్న ప్రతి విద్యార్థికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు అని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంతో ప్రాధాన్యతను గల పదవ తరగతి పరీక్షలు రేపటి నుండి ప్రారంభమై ఏప్రిల్ 4 వరకు ఉదయం 9 గంటల 30 నిమిషాల నుండి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని కలెక్టర్ తెలిపారు. పది పరీక్షలు ప్రతి విద్యార్థి జీవితానికి మైలురాయి అని, ఈ మైలురాయిని అధిగమించడానికి మీరు ఎంత దృఢంగా నిలబడతారో తదుపరి మీ ఉజ్వల భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు ఈ పరీక్షల సమయంలో ధైర్యంతో, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయడం ద్వారా విజయం సాధించగలరని ఆయన తెలిపారు. పరీక్షల్లో విజయానికి ప్రణాళిక బద్ధంగా చదివి, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పరీక్షలు అంటే భయపడకుండా అన్ని ప్రశ్నలకు మంచిగా స్పష్టంగా సమాధానాలు రాయాలని సూచించారు. మానసిక ఒత్తిడిని అధిగమించి, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన తెలిపారు. జిల్లాలో 73 పరీక్ష కేం ద్రాలు ఏర్పాటు చేయగా 12,282 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షల నిర్వహణకు 73 మం ది చీఫ్ సూపరింటెండెంట్లు, ఐదుగురు ఫ్లయింగ్ స్క్వాడ్లు, ఏడుగురు రూట్ అధికారులు. 73 మంది డిపార్టుమెంటల్ అధికారులు, 26 మంది సెంటర్ కస్టోడియన్లు, 73 మంది సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశారు. ప్రశ్నపత్రాల రవాణా, పరీక్ష అనంతరం సమాధానపత్రాల బండిళ్లను పోస్టాఫీసులకు చేరవేసేందుకు పోలీసు బందోబస్తు, పరీక్ష కేంద్రాల వద్ద సిసి కెమెరాలు, పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, మాల్ ప్రాక్టీస్ ను నిరోధించేందుకు సమీపంలోని జిరాక్స్ కేంద్రాలు మూసి వేసే విధంగా తగిన చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులందరూ పరీక్షా కేంద్రాల వద్దకు సకాలంలో చేరుకునేలా అవసరమైన మార్గాల్లో బస్ సర్వీస్ లు నడిపేలా ఆర్టీసీ అధికారులు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాయడానికి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేసినట్లు కలెక్టర్ తెలిపారు.విద్యార్థులందరూ 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా రాయాలని తద్వారా నూరు శాతం ఫలితాలు సాధించి రాష్ట్రంలో ఉత్తీర్ణత శాతంలో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

## వసతి గృహంలో మద్యం సేవించి అసభ్యంగా ప్రవర్తించిన

# కీచక ఉపాధ్యాయుడిని ఉద్యోగం నుండి తొలగించాలి

### పి డి యస్ యూ, పి వై ఎల్ డిమాండ్

**తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ టేకులపల్లి మార్చి 20**
వసతి గృహంలో మద్యం సేవించి అసభ్యంగా ప్రవర్తించిన కీచక ఉపాధ్యాయుడిని ఉద్యోగం నుండి తొలగించాలి పి డి యస్ యూ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ, పి వై ఎల్ రాష్ట్ర కార్యదర్శి వాంకుడోత్ అజయ్ డిమాండ్ చేశారు. గురువారం పి డి యస్ యూ సంఘాల నాయకులు బాదిత విద్యార్థిని గ్రామంలో గ్రామస్తులతో మాట్లాడారు. టేకులపల్లి మండలం గంగారం గ్రామం ఆశ్రమ పాఠశాలలో గత రెండు రోజుల క్రితం మంగళవారం ఒక ఉపాధ్యాయుడు మద్యం సేవించి ఒక విద్యార్థిని పట్ల లైంగికంగా వేధింపులకు గురి చేశాడనే కారణంతో విద్యార్థిని కుటుంబ సభ్యులు,గ్రామస్తులు కలిసి దేహ శుద్ధి చేసిన సంఘటన అందరికీ విధితమే. ఈ విషయం పై పి డి యస్ యూ, పి వై ఎల్ ప్రగతిశీల విద్యార్థి యువజన సంఘాల నేతృత్వంలో జరిగిన విషయాలను చర్చించి వాస్తవ విషయాలను తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తుల నుండి వెలుగులోకి వచ్చిన విషయాలు అనేకం ఉన్నాయి. విద్యార్థినిని గత కొన్ని రోజుల నుండే వేధింపులకు గురి చేస్తున్నాడనే విషయం విద్యార్థినీ కుటుంబ సభ్యులతో చెప్పుకోలేక పోయిందని కీచక ఉపాధ్యాయుడి ప్రవర్తన స్వయంగా కుటుంబ సభ్యులే చూడడంతో దేహశుద్ధి చేసి పోలీస్ స్టేషన్ కు అప్పచెప్పాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు తెలిపారు. వార్డెన్ గా తండ్రి పాత్ర పోషించాల్సిన ఆ



ఉపాధ్యాయుడు విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించడం వల్ల గిరిజన ఆశ్రమాలలో జరుగుతున్న ఇలాంటి సంఘటనలు చూసి విద్యార్థుల తల్లిదండ్రులు మనోవేదనకు గురవుతున్నారని, గిరిజన ఆశ్రమాలపై తల్లిదండ్రులకు నమ్మకాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా గిరిజన శాఖ అధికారులు ఆశ్రమాలలో జరుగుతున్న ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి డి యస్ యూ డివిజన్ కార్యదర్శి బానోత్ నరేందర్, పి వై ఎల్ డివిజన్ నాయకులు ఊకె శ్రావణ్, గ్రామస్తులు రాచకొండ గోపి,జోగ సమ్మయ్య దొర యాస నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# బిఇడి కాలేజీల్లో పంతుల్లకు పైసల్లేవు..

**- అరకొరజీతాలు, విద్యా నాణ్యత పై పలు అనుమానాలు**
**- ఒక్కోలెక్చరర్ 3సబ్జెక్టు లు చెప్పుతూ విద్యార్థుల బ్రతుకులను అపహాస్యం చేస్తున్న యాజమాన్యం**
**- బయో మెట్రిక్ పెట్టాలి**
**- డుమ్మా కొట్టిన విద్యార్థుల నుండి అటెండెన్స్ ఫీజు, రికార్డుల ఫీజు, ట్యూషన్ ఫీజుల పేరున ఒక్కొక్కరి నుండి 5000/- వసూల్**

**నేషనల్ హ్యూమన్ రైట్స్ జాతీయ అధ్యక్షులు మంగళ పెల్లి హుస్సేన్**

**తొలి సమయం మహబూబాబాద్ జిల్లా మార్చి 20:**
బిఈడి విద్యా విధానం విద్యార్థుల భవిష్యత్తును అపహాస్యం చేస్తుందని. అరకర జీతాలు అరకర బోదనా సిబ్బందితో నాణ్యత లేని విద్యని అందిస్తూ యాజమాన్యాలు నాలుగు రాళ్లు వెనుకేసుకుంటున్నాయని ఇద్దేవా చేశారు దానివల్ల విద్యా వ్యవస్థ రోజు రోజుకు దిగ జారీ పోతుందని అన్నారు, వెంటనే ప్రభుత్వం అప్రమత్తం కాని యెడల, భవిష్యత్ తరాలకు అన్యాయం జరుగుతుందని, బలహీన సమాజం, అస్తవ్యస్త ఏర్పడుతుంది అని అడ్మినిస్ట్రేషన్ ఆఫీషియల్, హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ సోషల్ సర్వీస్ జాతీయ అధ్యక్షుడు మంగళ పెల్లి హుస్సేన్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, పేరుకే బీఈడీ కాలేజీ లెక్చరర్ జీతాలు అంతంత మాత్రమే రోజురోజుకు దిగజారుతున్న విద్య వ్యవస్థ నాణ్యమైన విద్యకు నాణ్యమైన ఫ్యాకల్టీ అవసరం అలాగే శ్రమకు తగ్గ ప్రతిఫలాన్ని ఇవ్వాల్సిన అవసరం కూడా ఉందని నేషనల్ హ్యూమన్ రైట్స్ తరపున తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని యూనివర్సిటీ వీసీలు కమిటీ వేసి అతి త్వరగా బీఈడీ కాలేజీ లెక్చలర్ జీతాలు పెంచాల్సిన అవసరం ఉందని నేషనల్ హ్యూమన్ రైట్స్ భావిస్తుంది,




**ప్రతి బీఈడీ కాలేజీలో 1o7 ఫ్యాకల్టీ ఉండాలి**
ప్రతి బీఈడీ కాలేజీలో 50 మంది స్టూడెంట్స్కు 1o7 లెక్చరర్స్ ఉండాలి 100 మంది స్టూడెంట్స్ కు 1o15 లెక్చరర్స్ ఉండాలి కానీ యాజమాన్యం అసమర్థ్యం వాళ్ల కొంతమందిని పెట్టుకుని ఒక్కొక్కరు మూడు సబ్జెక్టులు చెప్పడం కొన్ని కాలేజీల పరిస్థితి దారుణంగా ఉంది, శ్రమకు తగ్గ ప్రతిఫలం ఇవ్వకుండా లెక్చలర్ల రక్తాన్ని పిలుస్తున్న పరిస్థితి ఏర్పడింది, దానికి ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ రిజిస్టర్ డిపార్ట్మెంట్ వాళ్లు కీలక నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం కూడా ఉంది, ఈ రోజులలో బయట మార్కెట్లో ధరలు పెరిగి కుటుంబాన్ని పిల్లలు పోషించుకోలేని స్థితిలో ఉన్నారు, కేవలము 12000 జీతంతో ఎలా బ్రతకమంటారు ఒకసారి ఆలోచించండి, ప్రతి కాలేజీలో బయోమెట్రిక్ అవసరం చాలామంది బీఈడీ కాలేజీలో కాలేజీకి రెగ్యులర్గా రాని వాళ్లకు ఒక్కొక్కరి దగ్గర 5000 చొప్పున దండుకుంటున్న వైనం అటెండెన్స్ ఫీజు రికార్డుల ఫీజు ట్యూషన్ ఫీజు, స్కూల్ టీచింగ్ రాకుండా ఫీజ్, ఇలాంటి ఎన్నో మరెన్నో జరుగుతున్న వైనం, దీని వల్ల యాజమాన్యం లాభం తప్ప లెక్చలర్లకు ఎలాంటి లాభం లేదు, కానీ పనిచేసేది మొత్తం చివరి వరకు లెక్చరర్స్ మాత్రమే, కానీ ప్రతిఫలం శూన్యం, త్వరలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర మంత్రులకు లేఖ రాస్తాము అని తెలియజేశారు

## పదో తరగతి విద్యార్థులకు ఆల్ ద బెస్ట్

**మల్ల నరేంద్ర ప్రసాద్. పెద్దమల్ల శోభారాణి**

తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ సుజాతనగర్ మార్చి 20
సుజాతనగర్ మండలం లోప్రతి ఒక్క విద్యార్థికి విద్యా దశలో పదవ తరగతి వారి ఉన్నత చదువులకు తొలి మెట్టు అని ప్రతి ఒక్క విద్యార్థి దృఢ సంకల్పంతో పరీక్ష రాయాలని ఎటువంటి భయాందోళనకు లోనవ్వకుండా ప్రశాంతంగా పరీక్ష రాయాలని ప్రతి ఒక్క ప్రశ్న ను పూర్తిగా అవగాహన



చేసుకొని చదివి రాయాలని తద్వారా విజయం సాధించగలరని తెలియజేశారు. విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని పరీక్ష సమయాల్లో వారు ఒత్తిడికి గురి కాకుండా చూసుకోవాలని విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడానికి ఏకాగ్రత కలిగి ఉండాలని అన్నారు. ఇది పరీక్షల సమయం కాబట్టి విద్యార్థులు ఎవరైనా లిఫ్ట్ కోసం సహాయం అడిగితే తప్పకుండా వారికి ప్రతి ఒక్కరు సహాయ సహకారాలు అందించాలని వారు అన్నారు.

## అగ్ని ప్రమాద బాధితులకు లైన్స్ క్లబ్ చేయూత !



**తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/భద్రాచలం మార్చి 20**
ఇటీవల అగ్ని ప్రమాదానికి గురై సర్వం కూలిపోయిన ఎట్ట పాక మండలంలోని తోటపల్లి గ్రామానికి చెందిన ధారా వెంకటేశ్వర్లు కాటూరి నరసమ్మ కుటుంబాలకు లైన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం ఆధ్వర్యంలో నక్క వెంకన్న సిద్ధారెడ్డి ల సౌజన్యంతో నిత్యవసర వస్తువులను గురువారం అందించారు. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం అధ్యక్షులు చిట్టినీడు రామలింగేశ్వర రావు మాట్లాడుతూ తోటపల్లి గ్రామంలో అగ్ని ప్రమాదానికి గురై రెండు పూరీలు పూర్తిగా దగ్ధం అయిపోవడంతో ఆ రెండు కుటుంబాలు నిస్సహాయ స్థితికి చేరుకున్నాయని అన్నారు. సర్వం కోల్పోయిన రెండు కుటుంబాలకు ఆసరాగా ఉండాలనే లక్ష్యంతో ప్రముఖులైన నక్క వెంకన్న సిద్ధారెడ్డిలు వెంటనే స్పందించి రెండు కుటుంబాలకు సరిపోయే నిత్యవసర వస్తువులను లైన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం ఆధ్వర్యంలో అందించడం అభినందనీయమని అన్నారు. ఆపదలో ఉన్న తోటి వారికి సహాయం చేయడమే లైన్స్ క్లబ్ యొక్క ప్రధాన లక్ష్మణ్ దానికి అనుగుణంగానే అవసరం ఉన్న వరకు సహాయ సహకారాలు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ సభ్యులు పాల్గొనగా నక్క వెంకన్న సిద్ధారెడ్డి చేతుల మీదుగా బాధితులకు కిట్లను అందించారు

## మధ్యాహ్నం భోజనం సరిగా పెట్టడం లేదు

**పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని నిలదీసిన విద్యార్థులు**



**తొలి సమయం తొర్రూరు మార్చ్ 20**
తొర్రూరు మండలం అమ్మాపురం ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం సరిగా పెట్టడం లేదు అంటూ విద్యార్థిని విద్యార్థులు మరియు తల్లిదండ్రులు ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని నిలదీశారు విద్యార్థుల బాధలు పట్టించుకోకుండా అక్కడి నుంచి జారుకున్న యశస్విని రెడ్డి మధ్యాహ్న భోజనం సరిగా ఉండటం లేదు అని నిరసన వ్యక్తం చేశారు ఈరోజు ప్రభుత్వ పాఠశాలలో వంట సామాగ్రిని అందజేయడానికి వచ్చిన ఎమ్మెల్యేను విద్యార్థులు తల్లిదండ్రులు నిలదీయడం జరిగింది

## పరీక్ష ప్యాడులు పెన్నులు పంపిణీ

**తొలి సమయం తొర్రూరు మార్చి 20**



కుమ్మరి కుంట్ల ఉన్నత పాఠశాలలో త్వరలో పరీక్షలకు హాజరు కాబోయే పదవ తరగతి విద్యార్థులకు పరీక్షల మెలకువలను చెప్పి పరీక్షా సామాగ్రిని అందజేసి వారికి శుభాకాంక్షలు తెలిపినారు. పర్యావరణ పరిరక్షణ లో భాగంగా పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. మధ్యాహ్నం రెండు వందల మందికి అన్న ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు సాయంత్రం అంబేద్కర్ నగర్లోని ఎస్సీ కాలనీలో మహిళలకు అవసరార్థులకు 25 మందికి చీరలు పంపిణీ చేశారు మరియు సకల దేవతలకు నిలయమైన గోశాలలోని గోవులకు దాన ను గోశాల అధ్యక్షులు దారం కుమారస్వామి అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు నవీన్ కుమార్ కోశాధికారి లయన్ శంకర్ పీ జెడ్ సి ఏ వెంకట్ రెడ్డి, లయన్ రేగురి వెంకన్న లయన్ సరేష్ లయన్ వేణుగోపాల్ లయన్ వేణుమాధవ్ లయన్ ముడుపు రవీందర్ రెడ్డి లయన్ తాళ్లపల్లి రమేష్ మొదలగు లయన్ మిత్రులు హాజరై శుభాకాంక్షలు తెలిపి సేవా కార్యక్రమాలు చేసినందుకు అభినందించినారు ఇలాంటి కార్యక్రమాలు ముందు కూడా చేయాలని కోరినారు.

# రైతుల నిరసన దీక్ష

**ఎండిన పంట పొలాలకు ఎకరానికి 25 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలి**



**తొలి సమయం పాలకుర్తి మార్చి 20**
ఎండిపోయిన పంట పొలాలకు రైతులకు మద్దతుగా ప్రతి ఎకరాకు 25 వేల రూపాయల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు బోనస్ 100% అమలు చేయకుండా బోగస్ మాటలు చెప్పారని రైతులపై చిత్తశుద్ధి లేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదవిలో ఉండడం సిగ్గుచేటు అన్నారు రైతులకు అండగా జనగామ జిల్లా దేవరుప్పల మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం ఏర్పాటు చేశారు దేవరుప్పుల మండలం కార్యాలయంలోని అధికారులకు పట్టణస్యం చూసి ఎంత మేర నష్టం జరిగిందో అంచన వేయవలసిందిగా వినతి పత్రం అందజేసిన బి.ఆర్.ఎస్ నాయకులు ఎండిన పంటలను పరిశీలించి రైతులకు సాగునీరు అందించి ఎండిన ప్రతి పంటకి నష్టపరిహారం ఇవ్వాల్సిందిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాను మాజీ మంత్రి ఎర్రబెల్లి

# సామాజిక న్యాయానికి పెద్ద పీట వేసిన కాంగ్రెస్

**బి.సి బిల్లు,ఎస్సీ వర్గీకరణ బిల్లులను ఆమోదించిన కాంగ్రెస్ కు కృతజ్ఞతలు**

**వరంగల్ జిల్లా కోర్టులో మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్న న్యాయవాదులు**




**తొలి సమయం హన్మకొండ మార్చ్ 20:**
సామాజిక న్యాయానికి కుల జనగణన ఎక్స్రే లాంటిదని, సామాజిక న్యాయమే తన జీవిత లక్ష్యమని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ ఇచ్చిన మాటకు కట్టుబడి, అసెంబ్లీ ఎన్నికల వేళ కామారెడ్డి డిక్లరేషన్ లో ప్రకటించిన విధంగా స్థానిక సంస్థల్లో బి.సి లకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి అసెంబ్లీలో తీర్మానం చేసినందుకు పిసిసి లీగల్ సెల్ అధ్యక్షులు పొన్నం అశోక్ గౌడ్ సూచన మేరకు వరంగల్, హనుమకొండ జిల్లా న్యాయవాదులు గురువారం కోర్టులోని అంబేద్కర్ హాల్ లో మిఠాయిలు పంచుకొని సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు తీగల జీవన్ గౌడ్, హనుమకొండ బార్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి ముద్దసిర్, కాంగ్రెస్ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, రాష్ట్ర కన్వీనర్లు కూనూరు రంజిత్ గౌడ్, పిల్లి కార్తీక్, కందుకూరి రజనీకాంత్, వరంగల్ జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ అధ్యక్షులు శామంతుల శ్రీనివాస్, సీనియర్ న్యాయవాదులు అంబరీష్ రావు, పులి సత్యనారాయణ, ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్ లు మాట్లాడారు. దేశంలోనే మొట్టమొదటిగా తెలంగాణ రాష్ట్రంలో కుల జనగణన జరిపి బి.సి లకు 42 శాతం రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో తీర్మానం చేసినందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, బి.సి ఉద్యమకారులకు కృతజ్ఞతలు తెలిపారు. స్వాతంత్రం వచ్చి 77 ఏండ్లు దాటినా 60 శాతం పైగానున్న బి.సి జనగణన చేయకోవడం దుర్మార్గమని, అణగారిన వర్గాల దుస్థితిని గుర్తించిన కాంగ్రెస్ పార్టీ బి సి ల కోసం 42 శాతం రిజర్వేషన్ల బిల్లు, ఎస్సి ల కోసం ఎ బి సి వర్గీకరణ బిల్లును ఒకేరోజు అసెంబ్లీలో తీర్మానం చేయడం గొప్ప విషయమని అందుకు కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, బి.సి సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్, కొండ సురేఖ, పిసిసి అధ్యక్షులు మహేష్ గౌడ్, మాజీ ఎంపి మధుయాష్కీ, ఇతర మంత్రులకు తెలంగాణ అణగారిన వర్గ ప్రజలు రుణపడి ఉంటారని వారు అన్నారు. అసెంబ్లీలో బిల్లు తీర్మానంతోనే బి.సి లు ఆగిపోరాదని రిజర్వేషన్ల బిల్లును కేంద్ర ప్రభుత్వం చట్టం చేసే వరకు పోరాటం చేయాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన న్యాయవాదులు బి.సి రిజర్వేషన్లు చట్టం అయ్యే వరకు మరో తెలంగాణ ఉద్యమం లాగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు గునిగంటి శ్రీనివాస్, దయాన్ శ్రీనివాస్, కొక్కొండ రమేష్, సిద్ధునాయక్, చిర్ర రాజు, రమేష్ నాయక్, సురేష్, ఎగ్గడి సుందర్ రామ్, పల్లె ప్రశాంత్, శ్రీలత, ప్రియాంక, తులసిగారి రాజబాపు, అమృత రావు, దండు మోహన్, హరీష్, చింత నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల పై

# సుప్రీం కోర్టులో కీలక పరిణామం



**తొలి సమయం డెస్క్ హైదరాబాద్ మార్చి 20:**
పార్టీ పిరాయించిన ఎమ్మెల్యే ల పై అనర్హతకు సంబంధించిన కేసు కొనసాగుతున్న తరుణంలో సుప్రీం కోర్టులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. తాను పార్టీ ఫిరాయించలేదని,కాంగ్రెస్‌లో చేరలేదంటూ అఫిడవిట్ దాఖలు చేశారు.లి ఆ అఫిడవిట్‌లో తాను ఇప్పటికీ బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిచాక మర్యాదపూర్వకంగా తాను సీఎం రేవంత్‌రెడ్డిని కలిశానని స్పష్టం చేశారు. మీడియా వక్రీకరించిందని, తాను కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్టు వచ్చిన వార్తలన్నీ అవాస్తవాలేనని పేర్కొన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ మీద గెలిచిన పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ అంశంపై బీఆర్ఎస్ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. తమ పార్టీమీద గెలిచి, కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హతవేటు వేయాలని పిటిషన్ దాఖలు చేసింది. ఆ పిటిషన్‌పై చివరి సారిగా (మార్చి 4,మంగళవారం) జరిగిన విచారణలో ఎమ్మెల్యేల అనర్హత విషయంలో తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీం నోటీసులు జారీ చేసింది.

**ఆపరేషన్ సక్సెస్.. పేషెంట్ డెడ్**

బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. పార్టీ మారి నెలలు గడుస్తున్నా పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడంలో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ జాప్యం చేయడంపై తీవ్రంగా పరిగణించింది. విచారణలో 'ఆపరేషన్ సక్సెస్.. పేషెండ్ డెడ్' ధోరణి సరైంది కాదని వ్యాఖ్యానించింది. తదుపరి విచారణ(మార్చి 25)లోగా వివరణ ఇవ్వాలంటూ సుప్రీం కోర్టు ధర్మాసనం పార్టీ మారిన ఎమ్మెల్యేలకు, తెలంగాణ ప్రభుత్వం, స్పీకర్ కార్యాలయం, తెలంగాణ శాసనసభ కార్యదర్శి, భారత ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. విచారణను మార్చి 25కి వాయిదా వేసింది.

# అద్దులు దాటిన మెడికల్ మాఫియా

**డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండానే మందుల విక్రయాలు**

**క్వాలిఫైడ్ రిజిస్టర్ ఫార్మసిస్ట్ తప్పనిసరి సర్టిఫికెట్లు అద్దెకు తెచ్చి మరి షాపుల నిర్వహణ ఫార్మసీ చట్టాలకు తూట్లు..**

**డ్రగ్స్ కంట్రోల్ అధికారులు చర్యలు తీసుకుంటారా..?**




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,/ సుజాతనగర్ మార్చి 20**
సుజాతనగర్ మండల కేంద్రంలోమెడికల్ మాఫియా రోజురోజుకు పెరిగిపోతుంది. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న మెడికల్ షాపులు సుజాతనగర్ మండల కేంద్రం లో మెడికల్ షాపుల రూటే. సపరేటుగా మారింది. ఎక్కడ చూసినా నూతన మెడికల్ షాపులు పుట్టుకొస్తూనే ఉన్నాయి. ప్రజల అమాయకత్వాన్ని అసరాగా చేసుకుని మెడికల్ షాపుల నిర్వాహకులు జేబులు నింపుకుంటున్నారు.రూల్ ప్రకారం డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులను విక్రయించకూడదు. కానీ ఇక్కడ ఇందుకు విరుద్ధంగా ఎలాంటి డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందుల విక్రయాలు జరుగుతున్నాయి. కొందరు సర్టిఫికెట్లను అద్దెకు తెచ్చుకొని మరి షాపులను నిర్వహిస్తున్నారు. అంతేకాదు పి ఎం పీ డాక్టర్లు వ్రాసిన చిట్టీల సైతం నిద్ర మాత్రలు ఇస్తున్నటువంటి వైనం, కొంతమంది మెడికల్ షాప్ ను అడ్డుపెట్టుకొని గుట్కా సిగరెట్ ల వ్యాపారం జోరుగా సాగిస్తున్నారు కానీ డ్రగ్స్ అధికారులు ఏమాత్రం చర్యలు చేపట్టడం లేదు విచ్చలవిడిగా మెడికల్ షాపులో గుట్కా సిగరెట్లు వ్యాపారం సాగిస్తున్న ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు లబోదిబోమంటున్నారు డ్రగ్స్ కంట్రోల్ అధికారులు తనిఖీలు నిర్వహించినప్పుడు మాత్రం ఫార్మసిస్ట్ అక్కడ కనిపిస్తాడు. మిగతా రోజుల్లో ఫార్మసిస్ట్ జాడే కానరాదు. ఈ విధంగా మెడికల్ షాపుల నిర్వాహకులు ఫార్మసీ చట్టాలకు తూట్లు పొడుస్తున్నారు. ఫార్మసీ యాక్ట్ (సెక్షన్- 42) ప్రకారం ఫార్మసిస్ట్ మాత్రమే మందులను విక్రయించాలి. కానీ సుజాతనగర్ లో ఇందుకు భిన్నంగా జరుగుతోంది. యాంటీబయాటిక్స్ అమ్మాల్సి వస్తే మాత్రం క్వాలిఫైడ్ ఫార్మసిస్ట్ పర్యవేక్షణ తప్పనిసరి. ఇలా చేయకుండా ఇష్టం వచ్చినట్లు మెడిసిన్ అమ్మి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కాంప్లికేటెడ్ మెడిసిన్, షెడ్యూల్-హెచ్ డ్రగ్స్ డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా ఇవ్వకూడదననే నిబంధనలు ఉన్నాయి. కానీ ఎంతవరకు మెడికల్ షాపుల నిర్వాహకులు నిబంధనలు పాటిస్తున్నారు. షెడ్యూల్ - హెచ్ డ్రాక్స్ వలన లివర్ కిడ్నీలు పాడైపోతాయని పలువురు వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికైనా డ్రగ్స్ కంట్రోల్ అధికారులు చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.




## ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం తరఫున వంట సామగ్రిని అందజేసిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**తొలి సమయం తొర్రూరు**



తొర్రూరు మండలం అమ్మాపురం ప్రభుత్వ పాఠశాలలో మరియు అన్ని ప్రభుత్వ పాఠశాలలకు త్వరలోనే వంట సామగ్రిని పంపిణీ చేస్తామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అమ్మాపురంలో 52 మహిళా సంఘాలకు ప్రభుత్వం రూ.4.17 కోట్ల వడ్డీ లేని రుణాలు అందించిందని గుర్తు చేశారు. ఆ రుణాలతో మహిళలు సాధించిన ప్రగతిని అడిగి తెలుసుకున్నారు.

## జర్నలిస్టులకు కేటాయించిన స్థలాలను తక్షణమే అప్పగించాలి : టీడీపీ రాష్ట్ర నేతలు కనుకుంట్ల, కాపా



**తొలిసమయం, కొత్తగూడెం మార్చి 20 :**
గతంలో జర్నలిస్టులకు కేటాయించిన స్థలాలను, తక్షణమే జర్నలిస్టులకు అప్పగించాలని టీడీపీ రాష్ట్ర నాయకులు. కనుకుంట్ల కుమార్, కాపా కృష్ణమోహన్ డిమాండ్ చేశారు. గురువారం గంగ హుస్సేన్ బస్తీలో జర్నలిస్టులు దీక్ష చేస్తున్న ప్రాంగణాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. జర్నలిస్టులకు గజం 8 రూపాయల చొప్పున ఇవ్వాలని తెలుగుదేశం పార్టీ తరుపున డిమాండ్ చేస్తున్నామని, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఉచితంగా ఇవ్వాల్సింది పోయి గజం 4800 రూపాయలు అనడం సరైన పద్ధతి కాదని దీన్ని టిడిపి తరపున వ్యతిరేకిస్తున్నామని, ముగ్గురు మంత్రులు ఉన్న జిల్లాలో జర్నలిస్టుల దీక్ష చేయడం చాలా బాధాకరమన్నారు. జర్నలిస్టు సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే స్పందించి జర్నలిస్టులకు గజం 8 రూపాయల చొప్పున ఇచ్చే విధంగా చొరవ చూపాలని, ఈ విషయంపై కలెక్టర్ కూడా స్పందించి ప్రభుత్వానికి ప్రపోజల్ పెట్టాలన్నారు. గతంలో సింగరేణి భూములను ప్రవేట్ వ్యక్తులపై ఆక్రమించుకుంటే గజం 25 రూపాయలు చొప్పున ఇచ్చేవారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎండీ అక్బర్ పాషా, ఉదయ్, కిరణ్ విజయ్, తేజ తదితరులు పాల్గొన్నారు.

## సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి

**ఎస్ సి సి డబ్ల్యూ యు రాష్ట్ర కోశాధికారి కొండపల్లి శ్రీనివాస్**




**తొలిసమయం, ఇల్లందు మార్చి, 20**
సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ఐఎఫ్టియు అనుబంధం సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎస్సిసిడబ్ల్యుయు)రాష్ట్ర కోశాధికారి కొండపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం ఇల్లెందు సి హెచ్ పి లో ఎస్సిసిడబ్ల్యుయు రాష్ట్ర నాయకులు ఆదర్ల అంజయ్య అధ్యక్షతన జరిగిన సింగరేణి రైల్వే కాంట్రాక్ట్ కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించడంలో,కనీస వేతనాలు చెల్లించడంలో పాలకులు వైఫల్యం చెందారని విమర్శించారు.అసెంబ్లీలో కాంట్రాక్టు కార్మికుల వేతనాల పెంపు గురించి సంవత్సరాల తరబడి చర్చిస్తున్నప్పటికిని అమలుకు నోచుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా అసెంబ్లీలో చర్చలకే పరిమితం కాకుండా వేతనాల పెంపుకు నిర్ణయం తీసుకొని జీవో విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీమేరకు కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో ఎస్సిసిడబ్ల్యు యు బ్రాంచ్ కమిటీ నాయకులు ఏ. మహేందర్,ఎల్.లక్ష్మణ్, ఓ.సాయి కుమార్,కె. జ్ఞానయ్య,జి.గణేష్, ఎం.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మండల లీగల్ సర్వీస్ కమిటీ న్యాయవాదిగా దంతాల ఆనంద్

**తొలిసమయం, ఇల్లందు మార్చి, 20.**



ఇల్లందు మండల లీగల్ సర్వీస్ కమిటీ న్యాయవాదిగా స్థానిక సీనియర్ నోటరీ న్యాయవాది దంతాల ఆనందును నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్199 ప్రకారం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇట్టి కమిటీ న్యాయవాదిగా పేద ప్రజలకు సత్వర నాయ సలహాలు సూచనలు అందించడానికి వీలుంటుంది. గ్రామ, గ్రామాన న్యాయ చైతన్య సదస్సులు నిర్వహించి ప్రజలకు చట్టాల పట్ల అవగాహన కల్పిస్తుండాలి. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు గ్రామ, గ్రామాన న్యాయ చైతన్య సదస్సులు నిర్వహించి ప్రజలకు చట్టాల పట్ల, కేసులు రాజీపట్ల అవగాహన పెంపొందించాల్సి ఉంటుంది. ఆనంద్ పదవి కాలం రెండు సంవత్సరాలు పాటు కొనసాగుతుంది. సామాజిక సేవ కార్యక్రమాలతో పాటు అనేక స్వచ్ఛంద కార్యక్రమాలను నిర్వహిస్తున్న న్యాయవాది ఆనంద్ తన వృత్తిని కొనసాగిస్తూ మండల లీగల్ సర్వీసెస్ సభ్యునిగా ప్రజలకు సత్వర నాయం అందేలా ముందుకు వచ్చినందుకు పలువురు పట్టణ ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. ఇది ఇలా ఉండగా ఆనంద్ తండ్రిగారైన దంతాల బిక్షపతి సింగరేణి సంస్థ నందు కాంట్రాక్టర్ గా పట్టణంలో పేరు ఉన్న వ్యక్తి. అంతేకాకుండా స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ గా కూడా అనేకమంది పేద ప్రజలకు సహాయ, సహకారాలు అందించి సింగరేణి సంస్థ నందు సుమారు 95 మందికి ఉద్యోగ అవకాశాలు ఇప్పించారు.

# పథకాల పేర్లు మార్పులు

## రాజకీయ రచ్చ చేస్తున్న నేతలు

**విశాఖపట్టణం,మార్చి20:** ఆంధ్రప్రదేశ్‌లో పేర్లమార్పు వివాదం మరోసారి రాజకీయరచ్చ రేపుతోంది. మొన్న హెల్త్ యూనివర్సిటీ– ..నిన్న కడప జిల్లా..తాజాగా విశాఖ క్రికెట్ స్టేడియం..ఇలా పేర్లను తొలగించడంపై వైరాపా ఆందోళనలకు దిగుతోంది. ఇందులో విశాఖ స్టేడియం ఇప్పుడు పేరు మార్చుకుంది. గతంలో హెల్త్ వర్సిటీకి ఎన్నో ఏళ్లుగా ఎన్టీఆర్ పేరు ఉండేది. జగన్ దానిని కెటికి వైఎస్ పేరు తగిలించారు. కడప జిల్లాను కేవలం వైఎస్సార్ జిల్లాగా చేశారు. ఇక్కడ ప్రజల సెంటిమెంట్‌ను దెబ్బతీసారు. జగన్ అధికారంలోకి రాగానే కూల్చవేతలతో మొదలు పెట్టారు. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భవనాన్ని కూల్చారు. ఇలా ప్రభుత్వాలు ప్రజల సొమ్ముతో ఆడుకుంటున్నాయి. ఇష్టారాజ్యంగా పేర్లు మారుస్తున్నారు. దీనికి స్వస్తి పలకాల్సి ఉంది. అందుకే ఇప్పుడు టిడిపి కూటమి ప్రభుత్వం వైఎస్సార్ కడప జిల్లాగా మార్చింది., ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ పేరును యధాతథంగా మార్చేసింది. ప్రభుత్వం. అటు– పథకాలకు..ఇటు– కట్టడాలకు దివంగత సీఎం వైఎస్ పేరు తొలగించడంపై వైసీపీ మండిపడుతోంది... ప్రభుత్వ తీరును నిరసిస్తూ విశాఖలో ఆందోళనకు పిలుపునిచ్చింది.. దీంతో అక్కడ వైఎస్ విగ్రహానికి పాలాభిషేకం చేసిన కార్యకర్తలు వైఎస్ పేరును కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఇటీవలే వైయస్ఆర్ జిల్లా పేరును వైయస్ఆర్ కడప జిల్లాగా..వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ– పేరును తాడిగడప మున్సిపాలిటీగా మార్పు చేస్తూ ఏపీ కేబినెట్ నిర్ణయం తీసుకుంది... ఇప్పుడు తాజాగా విశాఖలోని డాక్టర్ వైఎస్ఆర్ ఏసీబీ వీడీసీఎం స్టేడియం పేరులో..వైఎస్ఆర్ పేరు మాయమయింది. దీంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు..కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నాగార్జున యూనివర్సిటీలో వైఎస్ విగ్రహాన్ని తొలగించారని.. బాపట్లలో వైఎస్సార్ విగ్రహాన్ని తగలబెట్టారని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు.. విశాఖలోని స్టేడియంకు వైఎస్ఆర్ పేరును తొలగించడాన్నినిరసిస్తూ నేడు స్టేడియం దగ్గర ఆందోళనకు దిగారు. ఏపీలో అధికారం మారినప్పుడల్లా పేర్ల మార్పుపై రాజకీయ రచ్చ కొనసాగుతోంది. గతంలో విజయవాడ లోని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ– పేరును వైసీపీ ప్రభుత్వం వైయస్సార్ హెల్త్ వర్సిటీగా మార్చింది. ఇది కావాలని చేసి లేని రచ్చను చేసింది. అధికారంలోకి రాగానే తిరిగి ఎన్టీఆర్ పేరును హెల్త్‌వర్సిటీకి పెట్టింది కూటమి ప్రభుత్వం. విశాఖ సీతకొండ హిల్‌వ్యూ పాయింట్‌ను గత వైసీపీ ప్రభుత్వం.. వైయస్ పేరు పెట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దీనికి అబ్దుల్ కలామ్ వ్యూ పాయింట్‌గా పేరు మార్చింది. 2019లో అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ హయాంలో అమలైన పలు పథకాల పేర్లను మార్చేసింది జగన్ ప్రభుత్వం.. జగనన్న, వైఎస్ఆర్ పేర్లతో పథకాలను అమలు చేసింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జగన్, వైఎస్ఆర్ పేర్లతో ఉన్న పథకాలకు కొత్త పేర్లు పెట్టింది. జగనన్న అమ్మఒడి పేరును తల్లికి వందనంగా మార్చగా.. జగనన్న విద్యా కానుక పథకాన్ని 'సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర' అని పేరు పెట్టారు. అలాగే, జగనన్న గోరుముద్దను 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం'గా మార్పు చేశారు. జగనన్న ఆణిముత్యాలును 'అబ్దుల్ కలాం ప్రతిభా పురస్కారం'గా మార్చింది ప్రభుత్వం. జగనన్న విద్యా దీవెన, వసతి దీవెనల పథకాల పేర్లను 'పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్'గా మార్చారు. జగనన్న విద్యాదీవెన పథకం 'అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి'గా మార్చింది కొత్త ప్రభుత్వం. అలాగే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పేరు కాస్తా.. ఎన్టీఆర్ ఆరోగ్య భరోసాగా మారింది. రాష్ట్రంలో వైఎస్ పేరు కనిపిస్తే కూటమి పార్టీలకు భయం పుడుతోందని..అందుకే ఇలాంటి చర్యలకు దిగుతున్నారని వైసీపీ మండిపడుతోంది.

# 2016లో బెట్టింగ్ యాప్ యాడ్ చేశా..

**తరవాత వారితో ఒప్పందం రద్దు చేసుకున్నా**

**దానితో తనకు ఎలాంటి సంబంధం లేదు**

**నటుడు ప్రకాశ్ రాజ్ వీడియో విడుదల**

**హైదరాబాద్,మార్చి 20:**



ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో బెట్టింగ్ యాప్‌ల వ్యవహారం సంచలనం సృష్టిస్తోంది. వాటికి ప్రచారకర్తలుగా ఉన్న సినీ నటులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్స్‌పై పోలీసులు కేసు నమోదు చేసి, విచారణకు పిలుస్తున్నారు. ఈ జాబితాలో సీనియర్ నటుడు ప్రకాశ్‌రాజ్ పేరు కూడా ఉంది. ఈ వ్యవహారం తన దృష్టికి రావడంతో ప్రకాశ్‌రాజ్ స్పందించారు. ఎక్స్ వేదికగా వీడియో విడుదల చేశారు. ప్రస్తుతం నేను ఒక విలేజ్‌కు షూటింగ్ కోసం వచ్చాను. ఆన్‌లైన్ గేమింగ్ యాప్ కేసుల గురించి, నేను చేసిన యాడ్ గురించి చర్చ జరుగుతోందని ఇప్పుడే నాకు తెలిసింది. అందరినీ ప్రశ్నించే నేను సమాధానం చెప్పాలి కదా! 'అలాంటి ప్రకటన ఎలా చేస్తార'ని అందరూ నన్ను ప్రశ్నిస్తున్నారు. 2016లో ఆ యాడ్ నా దగ్గరకు వచ్చింది. చేసిన మాట నిజం. అది తప్పని కొద్ది నెలల్లోనే తెలుసుకున్నా. 2017లో నా అగ్రిమెంట్ పొడిగిస్తానని వాళ్లు అడిగితే, 'ఆ యాడ్ తెలియక చేశాను. ఏడాది కోసం అగ్రిమెంట్ అయిపోయింది కాబట్టి, వెంటనే దాన్ని ఆపమని మీకు చెప్పలేకపోయా. ఇక ఆ యాడ్‌ను ప్రసారం చేయొద్దు. నేనూ నటించను' అని చెప్పాను. దాని తర్వాత ఏ గేమింగ్ యాప్‌లకు ప్రచారకర్తగా పనిచేయలేదని తెలిపారు. 2021లో లో ఆ కంపెనీ ఇంకో కంపెనీకి అమ్మేస్తే, ఏదో సోషల్‌మీడియా వేదికలో నా ప్రకటన వాడారు. అందుకు వాళ్లకు లీగల్ నోటీ–సులు పంపాను. ఆ ప్రకటన తొలగించాలని వాట్సాప్ ద్వారా కూడా సంప్రదించాను. వెంటనే వాళ్లు ఆపేశారు. ఇప్పుడు మళ్లీ అది లీకైంది. అందువల్లే ఈ సమాధానం చెబుతున్నా. ఇప్పటివరకూ పోలీస్‌శాఖ నుంచి నాకు ఎలాంటి సందేశం రాలేదు. వస్తే, వాళ్లకు వివరణ ఇస్తా. 9ఏళ్ల కిందట అదీ, ఏడాది కాంట్రాక్ట్ కోసం పనిచేసిన మాట వాస్తవం. మళ్లీ ఆ యాడ్ చేయలేదన్నది నిజం.

# ఇండ్ల స్థలాల సాధన కోసం కదం తొక్కిన కలం వీరులు

## మద్దతు తెలుపుతున్న వివిధ పార్టీలు, సంఘాల నాయకులు

**తొలిసమయం, కొత్తగూడెం (మార్చి 20)**
పట్టణంలోని గంగా బీషన్ బస్తి రైతువేదిక సమీపంలో జర్నలిస్టులకు గతంలో కేటాయించిన స్థలాన్ని జర్నలిస్టులకు అప్పగించాలని తమ న్యాయమైన కోరికను నెరవేర్చాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా జర్నలిస్టు మిత్రులు తమ పోరాటాన్ని కొనసాగిస్తుండటం అభినందనీయమంటు పలువురు వారికి మద్దతు పలికారు. గజం స్థలం రూ. 8 లకే ప్రభుత్వం పంపిణి చేయాలని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇంచార్జి కనుకుంట్ల కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. చాలీచాలని వేతనంతో, నిత్యం ఎంతో ఒత్తిడిలో ఉంటూ కూడా సమాజంలో జరిగే కార్యక్రమాలని, పేద ప్రజల గొంతుక వినిపిస్తున్న విలేకరుల న్యాయమైన డిమాండ్ లను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు.

జర్నలిస్ట్ ల దీక్ష కార్యక్రమానికి మద్దతు తెలిపిన జై భీమ్ రావు భారత్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్రా కామేష్, బాబా, మురళి, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి జాటోత్ కృష్ణ, ట్రేడ్ యూనియన్ సెంటర్ అఫ్ ఇండియా జిల్లా కార్యదర్శి పి సతీష్, జిల్లా ఉపాధ్యక్షులు వై గోపాల్ రావు, ఏఐయూకెఎస్ జిల్లా కార్యదర్శి బానోత్ ధర్మా, టియూఐసి జిల్లా నాయకులు ఎం. రాజశేఖర్ లు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇండ్ల స్థలం ఇవ్వడంతో పాటు ఇందిరమ్మ పథకంను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ 5వ వార్డ్




మాజీ కౌన్సిలర్ తలుగు అనిల్ మాట్లాడుతూ జర్నలిస్ట్ ల సమస్యను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు.జర్నలిస్ట్ ఇండ్ల స్థలాల కోసం నిరసన కార్యక్రమంలో సీనియర్ రిపోర్టర్ లు జునుమాల రమేష్, లోగాని శ్రీనివాస్, కాల్లోజీ శ్రీను, అప్పిడి లక్ష్మణ్, వాసాల చంద్రశేఖర్, కుమార్, అంతడుపుల రాజశేఖర్, జోగాం తారక్, వత్తికొండ రవి, ప్రవీణ్, కృష్ణారావు, రుద్ర రాజశేఖర్, పోలిశెట్టి రాజశేఖర్, వీరు నాయక్, అఫ్జల్ పఠాన్, ఏలూరి శ్రీనివాస్, ఈశ్వర్, పురం శ్రీనివాస్, పిట్టల రమేష్, ఆనంద్, చింతల చిరంజీవి, బీర రవి, ఖాజా, సత్య ప్రకాష్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ సంస్కరణలు రావాలి !

రాజకీయ సంస్కరణలు లేకుండా భారత్మనుగడ సాధ్యం అయ్యేలా కనిపించడం లేదు. ఎంతసేపు సీట్లు, ఓట్లు,నాయకుల జీతాలు, భత్యాలు, పెన్షన్లు, ఉచిత పథకాలు వంటివాటి చుట్టే రాజకీయం సాగుతోంది. దీనికి ఎక్కడో ఒక చోట ముగింపు రావాల్సి ఉంది. చైనా లాంటి దేశాలు ఆర్థికంగా పురోగమిస్తుంటే భారత్ మాత్రం కేవలం రాజకీయ నాయకుల స్వార్థం కారణంగా కుంటుతోంది. ఇంకా సీట్లు పెంచుకోవాలి...తమకు అవకాశాలు పెంచుకోవాలన్న దురాలోచన తప్ప ప్రజల సమస్యలు తీర్చడం, ఆకలి బాధలు తీర్చడం, సౌకర్యాలు పెంచడం వంటివన్నీ పక్కకు పోతున్నాయి. ప్రజల ఎజెండా ముందుకు రావడం లేదు. డీలిమిటేషన్‌తో తమ సీట్లు తగ్గుతాయని గొడవ చేస్తున్న స్టాలిన్ లాంటి వారు దీనికి సమాధానం చెప్పాలి. ఆయనకు వ్తాసు పలుకుతున్న వారు కూడా సమాధానం చెప్పాలి. అలాగే పదేళ్లుగా అధికారంలో ఉన్ మోడీ ముందుగా సమాధానం చెప్పాలి. ప్రజల కొనుగోలు శక్తి పెరిగిందా లేదా..ధరలు అదుపులోకి వచ్చాయా లేదా..నిరుద్యోగం తగ్గిందా లేదా అన్నది చట్టసభల్లో చర్చించడం లేదు. ప్రజలకు అవసరం లేని ఎజెండాలు తెరపైకి తెచ్చి, తమ పబ్బం గడుపుకునే రాజకీయాలు సాగుతున్నాయి. భారత జనాభా 140 కోట్లకు చేరిన క్రమంలో ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేరడం లేదు. ఇంకా జనాభా పెరగాలని కొందరు ప్రాంతీయ పార్టీల నేతలు ముఖ్యంగా స్టాలిన్, చంద్రబాబు లాంటి వారు ప్రచారం చేయడం సిగ్గుచేటు. ఉన్న ప్రజలకు సరైన ప్రాథిమిక సౌకర్యాలు కలిగించకుండా తమ రక్షణ కోసం వందలకోట్లు వెచ్చిస్తున్న వీరు ప్రజలను రక్షిస్తారనుకోవడం అత్యాశే కాగలదు. మారుతున్న కాలానుగుణంగా పాలకుల్లో మార్పులు రావడం లేదు. ఇకపోతే ఒకే పార్టీలో ఉంటున్న కొందరు రాజకీయ గుత్తాధిపత్యం చెలాయిస్తున్నారు. పాలనలో వారు, వారి కుటుంబ సభ్యులే నిరంతరంగా ఉండే విధంగా రాజకీయాలను తమకు అనుకూలంగా మార్చేసుకుంటున్నారు. పార్లమెంట్, అసెంబ్లీలకు ఒక్కరినే నిరంతరంగా ఎన్నుకునే విధానం కూడా మంచిది కాదు. ఈ క్రమంలో రాజకీయాల్లో మార్పులు రావాలి. అమెరికా తరహాలో కేవలం రెండు పర్యాయాలు మాత్రమే ఎన్నికల్లో పోటీచేసే విధానం రావాలి. ఒక్కరే ఏళ్లతరబడి ఎంపిలుగా, ఎమ్మెల్యేలుగా ఉండకుండా కేవలం రెండు టర్మ్‌ల కాలాన్ని మాత్రమే నియంత్రించాలి. ఈ మేరకు రాజ్యాంగంలో సవరణలు తీసుకుని రావాల్సి ఉంది. ప్రజలు ఈ ఎజెండాతో ముందుకు రావాలి. అప్పుడే యువతకు అవకాశం వస్తుంది. ముువత రాజీకాయల్లోకి వస్తే మార్పులు కూడా వస్తాయి. ఎన్నికల్లో పోటీ చేసేవారికి అర్హతలను కూడా నిర్ణయించాలి. ఇలా అర్హతలు లేకపోవడం వల్లనే స్వాతంత్ర్యానంతరం ప్రజాస్వామ్య ఫలాలు అందరికీ అందడం లేదు. కొందరే పాలకులుగా ఉంటూ..ప్రజల ఆకాంక్షలను విస్మరిస్తున్నారు. అందుకే పేదలు పేదలుగానే ఉన్నారు. ఆకలి కోసం అలమటిస్తున్న వారు అలాగే ఉన్నారు. రాజకీయ నేతలు పేదల పేరు చెప్పి పబ్బం గడుపుకుంటున్నారు. పాలకుల నిర్లక్ష్యం,విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు చేయడం,ఉచిత పథకాలను ప్రవేశ పెట్టడం వంటివన్నీ తగ్గాలి. మనం వేసే ఓటు సక్రమంగా పనిచేస్తుందా లేదా అన్నది ప్రజలు ఆలోచన చేయాలి. మన ఓటుతో గెలిచిన నేతలు సక్రమంగా పనిచేస్తున్నారా లేదా అన్నది కూడా ప్రజలే ఎప్పటికప్పుడు పరిశీలన చేయాలి. మన ఓటును ఆయుధంగా చేసుకుని దేశాన్ని సక్రంగా ముందుకు తీసుకుని వెళుతున్నారా లేదా అన్న ఆలోచన చేయాలి. ఏదో ఓటేశామన్న నిర్లిప్త ధోరణి కారణంగా పాలకులు రాజకీయాలను వ్యాపారంగా మార్చుకుని, అధికారం చేతబట్టి శాసిస్తున్నారు. ప్రజలను ఓటుబ్యాంకుగా తయారుచేసుకుని వారిని మభ్యపెట్టడం అలవర్చుకున్నారు. ఎన్నికల అక్రమాల్లో ఆరితేరిన నేతలంతా పాలకులుగా పెత్తనం చెలాయిస్తున్నారు. ఓట్లను కొనుగోలు చేయడం ఎలాగో నేర్చుకున్నారు.

మనం ఓటుకు అమ్ముడు పోవడం వల్లనే ఇలా జరుగుతోందని గుర్తించాలి. తమకు అనుకూలమైన ఎన్నికల అధికారులను, పోలీస్ అధికారులను అడ్డం పెట్టుకుని ఓట్లను వేయించుకుని ఎన్నికవుతున్నారు. ఈ విధానం పోవాలంటే ఎన్నికల్లో భారీ సంస్కరణలు రావాలి. ఒక్కరే నిరంతరంగా సర్పంచ్ నుంచి ఎంపి వరకు ఎల్లవేళలా ఎన్నికయ్యే పద్ధతికి స్వస్తి పలకాలి. చట్టసభల్లో అమెరికా లాగా కేవలం రెండు పర్యాయాలు మాత్రమే పోటీచేసే అవకాశం మాత్రమే ఉండాలి. ఎంపి, లేదా ఎమ్మెల్యేగా గెలిచిన వారు రెండు టర్మ్‌లకు మించి పనిచేయకుండా చట్టబద్ధ విధానం అమల్లోకి తీసుకుని రావాలి. జీవితాంతం ఒక్కరే ఎంపిగా లేదా ఎమ్మెల్యేగా ఉండే విధానం పోవాలి. దీనికి తక్షణ రాజ్యాంగ సంస్కరణ అవసరం. అప్పుడు ప్రజల్లో ఎక్కువ మందికి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం వస్తుంది. కొందరు నాయకులు మాత్రమే నిరంతరంగా అధికారాన్ని అడ్డం పెట్టుకునే ఆగత్యం ఉండదు. అలాగే కుటుంబంలో ఒక్కరికి ఒకే పదవి అన్న విధానం కూడా రావాలి. వారసత్వ రాజకీయాలను అడ్డుకోవడానికి ఇది దోహద పడగలదు. దేశంలోని యువత, మేధావులు దీనిపై చర్చచేయాలి. అలాగే రాజకీయ నాయకుల అవినీతిపై తక్షణం విచారణ జరిగేలా చట్టాలు రావాలి. సామాన్యులకు ఎలా అయితే చట్టబద్ధ విచారణ సాగి, శిక్షలు పడుతున్నాయో రాజకీయాల ను, పాలనను అడ్డం పెట్టుకుని అడ్డగోలుగా కోట్లు గడిస్తున్న నాయకులకు కూడా అలాగే విచారణ జరగాలి. శిక్షలు పడాలి. ఇలాంటి సంస్కరణలపై దేశవ్యాప్తంగా చర్చ జరగాలి. అక్రమంగా వేలకోట్లు సంపాదిస్తున్న వారంతా మహా నేతాలుగా చలామణి అవుతున్నారు. ఇకపోతే రాష్ట్రాల్లో అధికారం లో ఉండగా అవినీతికి పాల్పడిన నేతలను విచారించి కఠినచర్యలు తీసుకునే అధికారం కేంద్రప్రభుత్వానికి ఉండాలి. కేంద్రంలో అవినీతి జరిగితే కూడా నేతలను తక్షణం విచారించే రాజ్యాంగ వ్యవస్థ రావాలి. రాజకీయ నేతల అవినీతిపై తక్షణం లోక్‌పాల్ ఏర్పాటు అత్యావశ్యకం. ఎప్పటికప్పుడు సంస్కరణలు చేసుకుంటూ.. రాజ్యాంగాన్ని సవరించుకుంటున్న మనం ఈ విషయంలో కూడా సవరణలకు పూనుకోవాలి. ప్రాంతీయ పార్టీలు అధికారంలోకి రావడం వల్ల ఆయా నేతల కారణంగా ఎక్కువ శాతం అవినీతికి ఆస్కారం ఏర్పడింది. అలాంటి వారి పనిపట్టే చట్టబద్ధ వ్యవస్థ ఉండాలి. రాజకీయ పార్టీల నేతల అవినీతిపై సత్వర విచారణకు సుప్రీం సూచించినా అడుగు ముందుకు పడడం లేదు. అవినీతి కేసులు ఉన్నా ముఖ్యమంత్రులుగా, మంత్రులుగా చలామణి అవుతున్నారు. రాజకీయ అవినీతిని నిరోధించేలా రాజ్యాంగ సంస్కరణలకు శ్రీకారం చుడితేనే మన ప్రజాస్టామ్యానికి అర్థం ఉంటుంది.

# పక్కా ఓటర్ కార్డుకు అడుగు పడాలి

## - ఆధార్ మాదిరి ప్రత్యేక ఓటర్ కార్డు రావాలి - ఎన్నికల సంస్కరణలపై ఇసి దృష్టి పెట్టాలి

**న్యూఢిల్లీ,మార్చి20:** ఏటా ఓటరు దినోత్సవం జరుపుకుంటున్నా.. ఓటు విషయంలో పక్కా ప్రణాళికలు అమలు కావడం లేదు. ఆధార్, పాన్‌కార్డు పక్కాగా ఉంటున్నా...ఓటరు కార్డును నేటికీ పక్కాగా రూపొందించుకోవడం లేదు. తాజాగా వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఆధార్‌తో ఓటును అనుసంధానం చేస్తామని ఎన్నికల సంఘం ప్రకటించింది. నిజానికి ఈ పని ఎప్పుడో చేయాలి. ఓటు అన్నది ప్రజాస్వామ్య ప్రక్రియలో ఎంతో విలువైనది. దీనిపై నిర్లక్ష్యం తగదు. ఓటర్ల నమోదు నుంచి దొంగ ఓట్ల వరకు ..ఎక్కడ లోపం ఉందో ఎన్నికల సంఘం ఆలోచించడం లేదు. ఎన్ని ప్రకటనలు గుప్పించినా నేటికీ పక్కాగా ఓటు నమోదు కార్యక్రమాలు జరగడం లేదు. ఓటును ఆధార్‌కు అనుసంధానం చేయాలన్న సంకల్పం నెరవేరడం లేదు. అలాగే పర్మినెంట్ ఓటర్ ఐడి కార్డు నంబర్ ఉంటే తప్ప దొంగ ఓట్లకు స్వస్తి చెప్పలేము. ఓట్లను తొలగించారన్న ఆందోళనలూ తప్పుతాయి. ఈ రెండు అంశాలను ప్రజలు, మేధావులు విస్తృతంగా చర్చించాలి. ఇకపోతే తమ ఓటు పదిలం అన్న భరోసా ప్రజల్లో రావడం లేదు. ఎన్నికల సంఘం ఈ మేరకు అనేక కార్యక్రమాలతో ప్రజల్లో ఓటు చైతన్యానికి కృషి చేయాలి. అయితే సంస్థాగతంగా ఉన్న లోటుపాట్లపై మాత్రం కేంద్ర ఎన్నికల సంఘం దృష్టి సారించడం లేదు. ఓటర్ల నమోదు మొదలుకుని దొంగ ఓట్ల వరకు అనేక అనర్థాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదు. ఓటు వేసేందుకు వెళ్లే వరకు ఓటు ఉంటుందో లేదో తెలియడం లేదు. ఆధార్ నమోదు చేసుకున్నట్లుగానే పర్మినెంట్ నంబర్ ఉండాలి. పాన్ కార్డు నమోదయితే పర్మినెంట్ నంబర్ ఉంటుంది. ఓటుకు పర్మినెంట్ నంబర్ రావాల్సి ఉన్నా ఎందుకనో ప్రభుత్వం లేదా కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవడం లేదు. ఓటుకు ఆధార్ అనుసంధానం చేయడం ద్వారా ఓటును కూడా పర్మినెంట్ చేయాలి. ఇదే సందర్భంలో ఓటుకు కూడా ఆధార్ లాగా పర్మినెంట్ నంబర్ కూడా కేటాయిస్తే మరీ మంచిది. అప్పుడు బోగస్ అన్నదానికి చెక్ పెట్టగలం.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST:MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101